బుడమేరును ఆక్రమించి రోడ్డు

- ప్రభుత్వ డొంక రోడ్డులో ప్రైవేటు రోడ్డు
- పంచాయతీ తీర్మానం, అనుమతులు లేవు
- నోరు మెదపని ఆయా శాఖల అధికారులు

రామవరప్పాడు: టీడీపీ నాయకుల అండదండలతో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. వీరికి ఆయా శాఖల అధికారుల నుంచి పూర్తి సహకారం అందుతుండటంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో ప్రభుత్వ డొంక రోడ్డు, బుడమేరు కాలువ సైతం ఆక్రమించి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ రోడ్డు వేయడం చర్చనీయాంశమైంది. కాలువగట్టు ప్రాంతమైన అబ్దుల్ కలాం కాలనీ సమీపంలో బుడమేరు కాలువను ఆనుకుని రియల్టర్లు పదుల ఎకరాల్లో వెంచర్లు వేశారు. ఈ వెంచర్‌కు వెళ్లడానికి ఫ్లెఓవర్ సమీపంలోని ఎస్‌ఎల్‌వీ గ్రీన్ విల్లాస్ వెనుక అబ్దుల్ కలాం కాలనీకి వెళ్లే డొంక రోడ్డును 30 అడుగులకు పైగా సువిశాల తారు రోడ్డుగా మార్చేశారు. ఈ డొంక రోడ్డు పక్కనే రైల్వేట్రాక్ ఉంది. ఈ ప్రాంతంలో రైల్వేశాఖ గతంలో గడ్డర్లు ఏర్పాటు చేసింది. ఈ గడ్డర్లను కూడా తొలగించి రోడ్డు వేయడం గమనార్హం. నిబంధనల ప్రకారం పంచాయతీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు రోడ్డు వేయాలంటే పంచాయతీ తీర్మానంతో పాటు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. కానీ ఇవేవి పట్టని రియల్ ఎస్టేట్ సంస్థ ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం వివాదాలకు దారితీస్తుంది.

బుడమేరు కాలువనూ వదల్లేదు

ఈ డొంక రోడ్డు బుడమేరు కాలువను దాటుకుని వెంచర్ వరకూ సుమారు రెండు కిలో మీటర్లకు పైగా ఉంది. దీంతో సరాసరి ఈ రోడ్డు ప్రారంభం నుంచి వెంచర్ వరకు హైవే రహదారి మాదిరిగా తారు రోడ్డు వేశారు. పైగా బుడమేరు కాలువను కూడా కొంత మేర ఆక్రమించి రోడ్డు



డొంక రోడ్డు ప్రారంభం నుంచి వెంచర్ వరకు వేసిన తారు రోడ్డు

వేయడంతో కాలువ వెడల్పు కుంచించుకుపోయి పిల్ల కాలువలా దర్శనమిస్తోంది. బుడమేరును ఆక్రమించిన ప్రాంతంలో కాలువ కనిపించకుండా రోడ్డుకు ఒక వైపు వరుసగా రేకులను ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



బుడమేరు కాలువ కనిపించకుండా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన రేకులు

పెరగనున్న ముంపు తీవ్రత

ఇటీవల బుడమేరుకు వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం గ్రామంలోని కాలువగట్టు ప్రాంతాలపైన కూడా పడటంతో ముంపునకు గురైయ్యాయి. బుడమేరు వద్ద జరుగుతున్న ఆక్రమణల ఫలితంగా ముంపు తీవ్రత మరింతగా పెరుగుతుందని కాలువగట్టు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరులో నీరు పారకుండా ఎక్కడికక్కడ ఆక్రమణలు చోటు చేసుకోవడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. దీంతో రానున్న కాలంలో బుడమేరు ముంపు తీవ్రత మరింతగా పెరుగుతుందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పంచాయతీ అనుమతులు లేవు

రోడ్డు విషయమై పంచాయతీని ఎవరూ సంప్రదించలేదు. నిబంధనల ప్రకారం ప్రైవేటు వ్యక్తులు రోడ్డు వేయాలంటే పంచాయతీ తీర్మానంతో పాటు అధికారుల అనుమతులు కూడా తీసుకోవాల్సి ఉంది. డొంక రోడ్డులో తారు రోడ్డు వేయడానికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు.

– ఘంటా రామ్మోహనరావు, పంచాయతీ కార్యదర్శి, రామవరప్పాడు

నున్న హైస్కూల్ విద్యార్థులతో సీఎం ముఖాముఖి



నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముచ్చటించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్టేడియం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'పది సూత్రాలు ఒక విజన్' స్టాల్‌లో నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి స్టాళ్లలో నున్న హైస్కూల్ పదో తరగతి విద్యార్థినులు గాజుల సంధ్య, పానకాల భవ్యశ్రీతో పాటు పటమట జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని జ్ఞాన ప్రసూనతో కొద్దిసేపు వారు మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీ నుంచి జరిగే పరీక్షలపై వారిని ఆరా తీసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులతో పాటు హైస్కూల్ ఉపాధ్యాయులు సూరపనేని రవిప్రసాద్, పి.నాగేశ్వరరావు, సుబ్బారావు ఉన్నారు.

క్లుప్తంగా

16 నుంచి ధనుర్మాస మహోత్సవాలు



గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళాశాసనంతో ఈ నెల 16వ తేదీ నుంచి ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామి వార్లకు విశేష అర్చనలు, అఖండ దీపారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు దీక్షాకంకణ ధారణ జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

సౌత్ జోన్ అంతర్ వర్సిటీ ఖో-ఖో టోర్నమెంట్‌కు పోషిబాబు



నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని విజయ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థి తెల్లం పోషిబాబు సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ పురుషుల ఖో-ఖో టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఇటీవల గుడివాడ ఏఎన్నార్ కాలేజీలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ జట్టుకు పోషిబాబు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా విజయ బీపీఈడీ కాలేజీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పోషిబాబును మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి బీపీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉదయ్‌కుమార్ అధ్యాపకుడు జి. విజయ్‌కుమార్‌లు అభినందించారు.

యనమలకుదురులో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామ లింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీమహానందీశ్వర స్వామివారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రదోషకాలంలో శ్రీ మహానందీశ్వరుడికి అభిషేకం చేశారు. అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఈఓ ఎస్.భవాని పాల్గొన్నారు.

కానూరులో ఉచిత వైద్య శిబిరం

పెనమలూరు: కానూరు నారాయణ కాలేజీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్120 స్టార్ క్యాంపస్‌లో జరిగిన వైద్య శిబిరంలో స్థానికులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దాదాపు 400 మంది వైద్య సేవలు పొందారు. బీపీ, షుగర్, దంత, కంటి, తదితర వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డీన్ రామచంద్రచౌదరి, ఏజీఎం రాజశేఖర్‌బాబు, ప్రిన్సిపాల్ అంజిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త చక్రవర్తి



మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: రైతులకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. రైతు ధర్నా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన కానూరులో విలేకరులతో మాట్లాడారు. జగనన్న అధికారంలో ఉన్న ఐదేళ్లు రైతులు ఎంతో ధైర్యంగా ఉన్నారన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధరతో వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము జమచేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. నేడు రైతులు పండించిన పంట రోడ్లపై ఉండిపోయిందని, కూటమి ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర లభించడం లేదన్నారు. దళారులను ప్రభుత్వం ప్రోత్సహించి రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల కష్టాలు గుర్తించి సకాలంలో ధాన్యం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల కోసం ధర్నా చేసిన వైఎస్సార్ సీపీ క్యాడర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



కుందేరులో కులధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ వి.భావనారాయణ అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్ఓఆర్ అడంగల్‌కు ఐదు అర్జీలు, సర్వేకు ఒకటి చొప్పున అర్జీలు సమర్పించారు. పలువురు లబ్ధిదారులకు కులధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ సేవలను అర్హులందరికీ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సదస్సులను సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలకోట రాధిక, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయరు భాస్కర్‌రావు, వీఆర్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోరంకిలో ఎన్టీఆర్ వజ్రోత్సవాలు



పోరంకిలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ

పెనమలూరు: పోరంకిలో మహానటుడు నందమూరి తారక రామారావు వజ్రోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించనున్నామని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ తెలిపారు. పోరంకిలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వజ్రోత్సవాల్లో భాగంగా తారకరామం పేరుతో అన్నగారి అంతరంగం పుస్తకం ఆవిష్కరిస్తామన్నారు. ఎన్టీఆర్ జీవిత చరిత్రను భావితరాల కోసం పాఠ్యాంశ పుస్తకాల్లో పొందుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంత కాలం అన్నగారి పేరు ఉంటుందన్నారు. నటనలో, రాజకీయాల్లో ఎన్టీఆర్ ధ్రువతారని పేర్కొన్నారు. మహానటుడికి వజ్రోత్సవాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కంకిపాడు: రైతన్నకు అండగా వైఎస్సార్ సీపీ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి నేతృత్వంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా మచిలీపట్నం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కానూరులో ర్యాలీని ప్రారంభించి కార్యకర్తలను ఉద్దేశించి దేవభక్తుని చక్రవర్తి ప్రసంగించారు. అన్నదాతలను కూటమి ప్రభుత్వం నిట్టనిలువునా మోసం చేసిందని అన్నారు. ఉయ్యూరు సెంటరులో చేపట్టిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఉషారామ ప్రొఫెసర్ నరేష్‌కు డాక్టరేట్



ఉంగుటూరు: ఉషా రామ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కే నరేష్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (అనంతపురం) నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టా లభించిందని ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఫీడ్ ఇండక్షన్ జనరేటర్ ఆధారిత విండ్ పవర్ యూనిట్ కోసం మల్టీమోడ్ డ్రూప్ కంట్రోల్ విశ్లేషణ, ప్రభావంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ పొందారని చెప్పారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, అధ్యాపక బృందం ఆయనను అభినందించారు.

రేపు శాస్త్రీయ సంగీత కచేరి

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ కళాపీఠం ఆధ్వర్యంలో 15వ తేదీ ఆదివారం విఖ్యాత సంగీత విద్వాంసుడు ఎస్.రామమూర్తి శాస్త్రీయ సంగీత కచేరి ఏర్పాటు చేసినట్లు సంస్థ కార్యదర్శి సీవీకే రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో దుర్గాపురం సంస్థ కార్యాలయంలోని శ్రవణ వేదికపై కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ పాల్గొంటారన్నారు.

యువతే దేశ భవిష్యత్తు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఆత్కూరు స్వర్ణభారత్‌లో యువతతో వెంకయ్యనాయుడు

ఉంగుటూరు: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని, యువతే దేశ భవిష్యత్తు అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారితో శుక్రవారం ఆయన ముచ్చటించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించిందని అన్నారు. మన దేశాన్ని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతోనే పాకిస్తాన్ మాదకద్రవ్యాలను చొప్పిస్తోందన్నారు. పాకిస్తాన్ దుశ్చర్యతో పంజాబ్ రాష్ట్రం మాదకద్రవ్యాల ప్రభావానికి గురైందని, క్రమేణా అన్ని రాష్ట్రాలకు వ్యాపిస్తోందన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. యువతకు క్రమశిక్షణ, సమయపాలన, పెద్దలపట్ల వినయ విధేయతలు ఉండటం చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి, నైపుణ్య శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కొనసాగించాలి

పెనమలూరు: భారతీయ సంస్కృతిని విద్యార్థులు కొనసాగించాలి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకటయ్యనాయుడు అన్నారు. కానూరులో శుక్రవారం స్కాట్‌స్పైస్ అంతర్జాతీయ పాఠశాలలో విశ్వ విరాసత్ 2024-25 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. చదువుతోనే విద్యార్థులు విజయాలు సాధించగలుగుతారని వివరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ హెడ్ రమా, సీఈఓ కొడాలి జాహ్నవి, ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

గన్నవరం రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని, అందరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ వైద్యురాలు సృజన పేర్కొన్నారు. సావరగూడెం వెల్‌నెస్ సెంటర్ వద్ద శుక్రవారం గ్రామస్తులకు 104 వాహన వైద్య సేవలను అందించారు. 45 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

కొలువుతీరిన నూతన పాలకవర్గం



ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన పాలకవర్గం శుక్రవారం కొలువుతీరింది. ఆస్పత్రి కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సభ్యులుగా నాగప్రసాద్, సులోచన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలోని గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. పేద వర్గాలకు అందుబాటులో వైద్య సేవలు ఉండాలని, అవసరమైతే సిబ్బంది రోగుల ఇళ్లకు వెళ్లి రక్త పరీక్షలు చేయాలని సూచించారు. గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ శారమ్మ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు సమాయత్తం

- బోర్ల కింద వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్న రైతులు
- ముమ్మరంగా దమ్ము పనులు



ఈడుపుగల్లులో వరి సాగు పనులకు దమ్ము చేస్తున్న ట్రాక్టరు

కంకిపాడు: రబీ సీజన్‌లో దాళ్వా సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. బోర్ల సదుపాయం ఉన్న రైతులు భూములను దమ్ము చేసి వరి సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. రెండో పంటగా వరి సాగు చేసే పనులను రైతులు ముమ్మరం చేశారు. దీనికి గానూ స్థానికంగా విత్తనాన్ని సమకూర్చుని సాగులో నిమగ్నమవుతున్నారు.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా రెండో పంటగా రబీ సీజన్‌లో 1.10 లక్షల హెక్టార్లలో మినుము, నాలుగు వేల హెక్టార్లలో పెసలు, 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న ఇతర పంటలను సాగు చేస్తుంటారు. కాలువల కింద దాళ్వా వరి సాగుకు అనుమతులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మినుము, పెసలు, మొక్కజొన్న పంటలను ఎంచుకుని ఇప్పటికే సాగు చేస్తున్నారు. ప్రధానంగా అపరాల సాగుకు అవసరమైన విత్తనం 3911 క్వింటాళ్లు వ్యవసాయశాఖ సమకూర్చింది. అయితే బయటి మార్కెట్‌లోనూ మినుము క్వింటా రూ. 10 వేలు ఉండటం, స్థానికంగా రైతు వారీగా విత్తనాన్ని సమకూర్చుకుని అపరాలు సాగు చేస్తున్న విషయం తెలిసిందే.

తగ్గనున్న అపరాల సాగు

జిల్లాలోని కాలువల కింద సాగయ్యే భూములతో పాటుగా బోర్లు సదుపాయం ఉన్న ప్రాంతాలు కూడా అధికంగా ఉన్నాయి. నీటి లభ్యత లేకున్నా రెండో పంటగా దాళ్వా వరి సాగుచేసేందుకు రైతులు సమాయత్తం అవుతుంటారు. గతేడాది అపరాలకు అధిక ధర పలకడంతో రైతులు అపరాల సాగుకు చేపట్టారు. అయితే ఈ ఏడాది మాత్రం అపరాలతో పాటుగా వరి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో బోర్ల సదుపాయం ఉన్న ప్రాంతాల్లో సుమారుగా 30 వేలు నుంచి 35 వేల హెక్టార్లు వరకూ వరి సాగు జరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా వరి పంటకు నష్టం వాటిల్లింది. అధికారికంగా ప్రాథమికంగా అంచనాల ప్రకారం 44 వేల హెక్టార్లు వరి పంట దెబ్బతింది. ఖరీఫ్‌లో ఏర్పడిన నష్టాన్ని అధికమించేందుకు రెండో పంటగా అధిక శాతం మంది రైతులు దాళ్వా వరి సాగు చేపట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా భూములను దమ్ము చేసి వరి నారుమడులు పోసుకునేందుకు రెడీ అవుతున్నారు. అవసరమైన విత్తనాన్ని రైతువారీగా సమకూర్చుకుని సాగులో నిమగ్నమవుతున్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

కంకిపాడు: సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ అధికారులు చేశారు. అయితే ఎన్నిక ప్రక్రియ అన్నది నామమాత్రమేనని, అంతా కూటమి నిర్ణయం ప్రకారం సాగిపోతుందన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది. పెనమలూరు నియోజకవర్గంలో 17 సాగునీటి సంఘాలు ఉన్నాయి. పెనమలూరులో 3, కంకిపాడులో 8, ఉయ్యూరులో 6 సంఘాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రధానంగా బందరు, పుల్లేరు, రైవస్ కాలువలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా అనేక పంట కాలువలు, డ్రెయినేజీ విభాగానికి చెందిన బోదెలు ఉన్నాయి. వీటిపై నిరంతరం పర్యవేక్షణ వహిస్తూ సాగునీటిని కాలువ చివరి భూములకు చేర్చేందుకు అవసరమైన పర్యవేక్షణ బాధ్యతలను సాగునీటి సంఘాలు నిర్వహిస్తాయి.

సాగునీటి సంఘాల ఎన్నికలకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నామని తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఓటర్ల జాబితాను తరలించామని.. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. నియోజకవర్గంలో రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు కూడా ఈనెల 17న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.